క్లుప్తంగా

శ్రీమావుళ్లమ్మను దర్శించుకున్న కలెక్టర్


అన్నదానానికి విరాళం అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ నాగరాణి మంగళవారం దర్శించుకున్నారు. వారి కుమారుడు భరత్ చంద్ర పేరుమీద రూ.20 వేలు శ్రీ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానంకి విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు స్వాగతం పలికి పూజలు నిర్వహించి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ అన్న సమారాధన


అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: గ్రామంలో గరువు రజక వీధిలో ఉన్న శ్రీ నీలమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలా త్రిపుర సుందరీదేవికి వెండి సమర్పణ


బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని బలా త్రిపుర సుందరీ అమ్మవారి వెండి మకర పీఠానికి మంగళవారం దాతలు 100 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. కాళ్ల మండలం ఏలూరుపాడు చెందిన తలగళ్ల వెంకటేశ్వరరావు, ఝాన్సీ దంపతులు వారి కుమార్తె జోహిత వల్లి 100 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు. ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలకు పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉండి మండల వ్యవసాయాధికారిగా శ్రీనివాస్


శ్రీనివాస్

ఉండి: మండల వ్యవసాయాధికారిగా నిమ్మల శ్రీనివాసు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా భీమవరం మండలం నుంచి ఉండి మండలానికి బదిలీపై వచ్చారు. ఇదే స్థానంలో మండల వ్యవసాయాధికారిగా భాధ్యతలు నిర్వహించిన బి.సంధ్య పాలకోడేరు మండల వ్యవసాయాధికారిగా బదిలీపై వెళ్లారు.

ఉత్సాహంగా 'అంగన్‌వాడీ పిలుస్తోంది'


విస్సాకోడేరు గ్రామంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని విస్సాకోడేరు గ్రామంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్య కుమారి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పనిసరిగా తమ సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని తద్వారా చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను నేర్పిస్తారన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: జూలై 5న నరసాపురం కోర్టు సముదాయంలో జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం పదో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి, భీమవరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీ చేసుకోదగిన అన్ని కేసులను ఈ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అవగాహన కల్పించి కేసులు రాజీ అయ్యేలా పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని తెలిపారు.

హైవే ఆక్రమణలతో రోడ్డు ప్రమాదాలు

ఉండి: హైవే రోడ్డు నంబర్ 165 (పీపీ రోడ్డు) పాలకొల్లు నుంచి పామర్రు వరకు ఉండే ఈ రోడ్డు ప్రయాణికులు, వాహనదారుల పాలిట శాపంగా మారింది. ముఖ్యంగా ఈ రోడ్డు వెంబడి ఆక్రమణలతో వర్షపు నీరు వెళ్లే దారిలేక ప్రమాదాలు పెరుగుతున్నాయి. రోడ్డు ఆక్రమించి మార్జిన్లు కూడా ఆక్రమించి పూడ్చేస్తున్నా, చెట్లు నరికేస్తున్నా గానీ వాటిపైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఎన్నో ఏళ్ల నుండి రోడ్డు ప్రక్కనే వున్న నిద్రగన్నేరు, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే కొబ్బరిచెట్లు వంటివి నరికేస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదనే చెప్పాలి. అంతేకాకుండా రోడ్డు మార్జిన్‌ల ఆక్రమణల వల్ల వర్షపునీరు రోడ్డుపైనే నిలిచి రోడ్డు పాడవుతుంది. రోడ్డు నిర్మించినా లేదా ప్యాచ్ వర్కులు చేసినా ఒకటి లేదా రెండు రోజుల్లోనే రోడ్డు పాడవుతుందంటే దానికి కారణం ఆక్రమణలే అని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్డు పక్కనపుంటే మార్జిన్లు కూడా గుంతలుగా ఉండడం, వాటిలో నీరు నిలిచిపోవడంతో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనదారులు ఎన్నోసార్లు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎదురుగా వస్తున్న భారీ వాహనాల నుండి తప్పించుకునేందుకు మార్జిన్ దిగితే ఇక వారి సంగతి అంతే అన్నట్టుంది హైవే పరిస్థితి.

అధ్వానంగా హైవే

భీమవం నుంచి ఉండి, ఆకివీడు మండలాల పరిధిలో అయితే వాహనదారుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. రోడ్డు గుంతలమయం కావడం, మార్జిన్‌లో ఎక్కువ శాతం మట్టి ఉండటంతో వాహనదారుల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. పేరుకే హైవే గానీ రోడ్డు చాలా దారుణమైన పరిస్థితిలో ఉంది. షోరూంల వారు ఆక్రమణలు చేసి వారి ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టినా, డ్రెయినేజ్ సౌకర్యం లేకుండా పూడ్చివేసినా అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు రోడ్డుపై ఉండే నీటిలోనే వాహనాలు నడపాల్సిన పరిస్థితి తలెత్తింది. రోడ్డు పాడవునా ఉండే దుకాణాలు, షోరూంలు, ప్రజలు రోడ్డుకంటే ఎత్తుగా తమ స్థలాలు పూడ్చుకోవడంతో రోడ్డుపైకి మట్టి చేరుకుని వర్షపు చినుకుపడితే చాలా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల హైవే రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన ఓ షాపు ముందు, ఇప్పుడిప్పుడే నిర్మాణం జరుగుతున్న షోరూం వద్ద కొబ్బరిచెట్లను ఇష్టానుసారం నరికివేస్తున్నా అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదో? లేదా వారికి అనుమతులిచ్చేసారో తెలిడం లేదంటూ వాహనదారులు వాపోతున్నారు. ఆదాయంతో పాటు నీడనిచ్చే చెట్లను ఇలా నరికివేస్తే ఏంటి పరిస్థితి అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


హైవే ఆక్రమణలతో రోడ్డుపైనే వర్షపునీరు నిలిచిన దృశ్యం


హైవే పక్కన నిలిచిన వర్షపునీరు వల్ల జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

వాహనదారుల ప్రాణాలంటే లెక్కలేదు



హైవేపై ప్రమాదాలు నిత్య కృత్యంలా మారాయి. ఆకివీడు నుంచి ఉండి, భీమవరం పరిధిలో ప్రతి రోజూ ఏదో ప్రమాదం చోటు చేసుకుంటుంది. దీనివల్ల ఎంతో మంది వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది నిజంగా వాహనదారుల తప్పా లేక ఆక్రమణలు జరుగుతున్నా, హైవేపై సమస్యలు వున్నా పట్టించుకోని అధికారులదా? ప్రాణం పోతే తిరిగిరాదు.అయితే అధికాస్త నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు పోకూడదు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి.

– పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వాంద్రం

రోడ్డు మార్జిన్లు సరి చేయాలి



ఏదో సందర్భంగా పొక్లెయిన్‌ల సహాయంతో రోడ్లు పక్కనే వుండే చెత్తా చెదారం తొలగిస్తున్నారు తప్ప రోడ్డు మార్జిన్లలోవుండే మట్టిని మాత్రం తొలగించడం లేదు. హైవే మార్జిన్ దిగితే కనీసం కంకర వుండాలి. మార్జిన్‌లో ఏం ఉంటుందో అధికారులు పరిశీలిస్తే మంచిది. ప్రజల ప్రాణాలకు అధికారులను బాధ్యులను చేయాలి. అప్పుడే వారు సరైన చర్యలు తీసుకుంటారు.

– దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం


భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

భీమవరం: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగ ఎంతో దోహదం చేస్తుందని డాక్టర్ విజయ అన్నారు. భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన ద్వారా మేలు కలుగుతుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ మాట్లాడుతూ యోగా భారతదేశ వారసత్వ సంపదని దీని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ వడుపు గోపి, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, చెరుకువాడ రంగసాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్, స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

భీమవరం: భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, వీరవాసరం మండల కమిటీలను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో కమిటీల నియామకం చేపట్టినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అధ్యక్షుల నియామకం ఇప్పటికే జరగ్గా, మిగిలిన పదవులను భర్తీ చేశారు.

భీమవరం పట్టణ కమిటీ...

పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడిగా మల్లుల శ్రీనివాసరావు, చిగురుపాటి రాజు, జనరల్ సెక్రటరీలుగా కట్టా నాగ వెంకటరవిశంకర్, బాలం వెంకటశ్రీనివాస్, తుంపాల శ్రీను, తాళ్లపూడి పరమేశ్వరరావు, కార్యదర్శులుగా ముదునూరి సుబ్బరాజు, కముజు నర్సింహరావు, పూజారి రంగరాజు, ఓలేటి రాధాకృష్ణ, అబ్దుల్ హై, కార్యవర్గ సభ్యులుగా మేక మణికంఠ సతీష్‌కుమార్, దాసు రాజు, పైపూరి వెంకటసూర్యనారాయణ, ఎంఎస్ బాష, దుర్గ విజయకుమార్, కర్రి నందంనాయుడు, వాసంశెట్టి శ్రీనివాస్, బొక్కా సత్యనారాయణ, బుద్దరాజు వెంకటరామకృష్ణవర్మ, ఎస్ పైడిరాజు, గుల్లంకి రాజు, కొండేటి సుధాకర్, రొక్కల సుబ్బయ్య, రేలంగి శ్రీనివాసరావు, గంధం సీతారాము, కొలుకులూరి సత్యమోహన్, కోడే శ్రీధర్, షేక్ అజార్, సరిపల్లి రమేష్, జెట్టి వెంకటేశ్వరరావు, కోశిరెడ్డి రామబాలాజీ, లక్కు త్రిమూర్తులు, కోనాల ఏసుబాబు, కొమ్ము శ్రీనివాసరావు,నొకట్ల రంగారావు, వంక ఉయద్‌కుమార్, వై అప్పలనాయుడు, ఎం నర్సింహమూర్తి, తోట సాయిసత్యమూర్తి, యండమూరి సతీష్, చింతలపాటి రమేష్‌వర్మ, తిరుమాని రాము, చీర కృష్ణగాంధీ, ఎ రాంబాబు, గొల్లమండల స్టాన్లీ జాన్స్ నియమితులయ్యారు.

భీమవరం మండల కమిటీ..

భీమవరం మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా కొట్టు రామదాసు, బొమ్మిడి బాబూరాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా ఇందుకూరి వెంకటపతిరాజు, సీహెచ్ ఇజ్రాయిల్‌కుమార్, పెచ్చెట్టి రాము, బొమ్మిడి కొండరాజు, కార్యదర్శులుగా బొడ్డుపల్లి సామ్యూల్‌రాజు, బోసి వెంకటరత్నం, వీరవల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. కార్యవర్గసభ్యులుగా తిరుమాని సూరిబాబు, పాలపర్తి అబేలు, కాండ్రేకుల శ్రీనివాస్, పెచ్చెట్టి గోవిందరావు, లంక శ్రీనివాస్, వేమన సతీష్, కారెపల్లి మోహనరావు, బొట్టు ఏసురాజు, ఎ నాగరాజు, ఉంగరాల మాణిక్యాలరావు, పాలపర్తి జానికిప్రసాద్, మద్దా ఫిలిప్, సైక్ సిద్దయ్య, సీహెచ్ శ్రీను, చిలకపాటి ఆదామ్, గూడపాటి పెద్దిరాజు, మద్దా రాజారత్నం, నాగిడి లక్ష్మణస్వామి, అల్లూరి శ్రీహరిరాజు, రేవు నర్సింహస్వామి, అల్లూరి నర్సింహరాజు, వర్ధనపు సామ్యూల్, కొల్లేటి రవి, పుట్ల ప్రశాంత్ నియమితులయ్యారు.

వీరవాసరం మండల కమిటీ..

వీరవాసరం మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా బొంతు రమేష్, వీరవల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా లక్కాయల వెంకటబాలాజీ, చింతపల్లి ఏడుకొండలు, బాజింకి రాంబాబు, మద్దాల బాబి, సైదు శ్రీను నియమితులయ్యారు. అలాగే కార్యదర్శులుగా ఆనందం రాము, దేనబోయిన సుబ్రహ్మణ్యం, ముద్రగళ్ల ఏసురాజు కార్యవర్గ సభ్యులుగా లంక సత్యనారాయణ, బండి బాలాజీ, కడలి ఓంకార్, చదరం గోవిందం, నల్లమిల్లి రామకృష్ణ, తోటే చిట్టిబాబు, మేక శ్రీను, బండి మీరమ్మ, పెచ్చెట్టి శ్రీరాములు, పంజా సురేష్, అవాల శ్రీను, గుబ్బల గోవిందం, జోగి శ్రీను, కందుల శ్రీనివాసరావు, నక్కెళ్ల వెంకటేశ్వరరావు, గుండుబోయిన శ్రీను, ఓదూరి నారాయణరావు, గునుపూడి గణేష్, చొప్పళ్ల బాబ్జి, పడవల నాని, తన్నీడి సత్యనారాయణ, పత్తుల సోల్‌మన్, సిద్దు ప్రభుదీవెన నియమితులయ్యారు.

19న భీమవరం డీఎన్నార్‌లో యోగా ప్రదర్శన

భీమవరం: భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఈనెల 19వ తేదిన ఐదువేల మందితో భారీ యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. మంగళవారం డీఎన్నార్ కళాశాల ఆవరణలోని గన్నాబత్తుల క్రీడా మైదానాన్ని పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగప్రదర్శనను విష్ణు కళాశాల నుంచి డీఎన్నార్ కళాశాలకు మార్పు చేసినట్లు తెలిపారు. యోగ అభ్యసన కార్యక్రమంలో అథ్లెటిక్స్, స్పోర్ట్స్ గ్రూప్స్, యూత్ పాల్గొంటారని తెలిపారు.ఈనెల 21న అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా 19న మెగా యోగ ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగ అభ్యాసనాలను నిర్వహించేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లను త్వరితగతి పూర్తి చేయాలని అధికారులను నాగరాణి ఆదేశించారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ రాంబాబు తదితరులున్నారు.


యోగా ప్రదర్శనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

కథారినగర్‌లో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: భీమవరం పట్టణం బ్యాంక్ కాలనీలోని 26వ వార్డు కథారినగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని మైత్రీ కాలనీ సంఘం నాయకులు మునిసిపల్ అధికారులను కోరారు. మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, ఎంఈ పి త్రినాథ్ తదితరులు కాలనీలో పర్యటించగా మైత్రీ కాలనీ సంఘం అధ్యక్షుడు దిరిసాల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కమ్మిల శ్రీ రామచంద్ర మూర్తి, కార్యదర్శి అడ్డగర్ల ప్రభాకర గాంధీ మాట్లాడుతూ బ్యాంక్ కాలనీలోని కథారినగర్‌లో రిజర్వాయర్ చుట్టు పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లుపైకి చేరి దుర్గంధం వ్యాపిస్తోందని, రోడ్లు గోతులు మయం కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని మిలిగిన సమస్యలు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో మైత్రీసంఘం కోశాధికారి రామాయణం రమేష్ బాబు, జవ్వాది సత్తిబాబు, రాట్నాల సత్తిబాబు, బొర్రా మాణిక్యాలరావు, సమతం సత్యనారాయణ, చీమకుర్తి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


కథారినగర్‌లో సమస్యలను అధికారులకు వివరిస్తున్న మైత్రీకాలనీ సంఘం నాయకులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ఉండి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు సీతారాం ప్రసాద్, మండలకమిటీ కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. మంగళవారం ఉండిలో హమాలి,బజారు జట్టు కమిటీల నూతన నియామకంపై సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హమాలీ జట్టు కార్యదర్శిగా చెన్నంశెట్టి ఆదినారాయణ, బజారు జట్టు కార్యదర్శిగా పున్నాని అప్పారావులను నియమించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటాలతో సంపాదించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు సీపీఐ ఆధ్వర్యంలో విస్తృత పోరాటాలు చేసామని ఇప్పుడు కూడా చేస్తున్నామన్నారు. సీఐటియు జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీను మాట్లాడుతూ హమాలీ, బజారు జట్లు వేతనాల అమలు, హక్కుల సాధనకు పీఎఫ్, ఇంక్రిమెంట్ల వర్తింపునకు పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యుడు కోన గొల్లయ్య,పతివాడ గణపతి, తమ్మరాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉండిలో హమాలి, బజారు జట్టు సభ్యులతో సమావేశమైన సీపీఐ నాయకులు

పారా స్పోర్ట్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఆకివీడు: క్రీడలపై దివ్యాంగులు ఆసక్తి పెంపొందించుకుని ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పారా స్పోర్ట్సు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి పిలుపునిచ్చారు. పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర మంగళవారం ఆకివీడు చేరుకుంది. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద యాత్రకు వికలాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి నటరాజ్, దివ్యాంగులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో ఆయన మాట్లాడుతూ దివ్యాంగ క్రీడా కారుల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ద్వారా 3 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు ఎలాంటి రాత పరీక్షలు లేకుండా విద్యార్హతను బట్టి పొందేందుకు అవకాశం కల్పించారన్నారు. పారా ఒలింపిక్స్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెండల్స్ సాధించిన పారా క్రీడాకారులకు కోట్లాది రూపాయల నగదు ప్రోత్సహకాలు ఉన్నాయన్నారు. విశాఖపట్టణంలో పారాస్పోర్ట్స్ కోసం 22 ఎకరాల్లో అత్యాధునిక స్టేడియం నిర్మించడం మంచి పరిణామమన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి నటరాజ్, విజయనగరం జిల్లా గౌరవధ్యక్షుడు కె.దయానంద్, విశాఖ జిల్లా గౌరవధ్యక్షుడు డాక్టర్ శీతల్ మదన్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి నాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నటరాజ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.


రాష్ట్ర పారా స్పోర్ట్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

భీమవరం అర్బన్: ఏళ్ల తరబడి ప్రజాసేవ చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో సచివాలయంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిజిటల్ అసిస్టెంట్ సైని, ఫిషరీస్ అసిస్టెంట్ మంగాదేవికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అందజేయకపోవడంతో పెరిగిపోయిన నిత్యావసర ధరలతో వారి జీవనోపాధి కడు దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం టెండర్ల పేరుతో కార్మికుల జీతాలు ఇవ్వకుండా పెండింగ్లో పెట్టి వారి జీవితాలతో ఆటలాడుకుంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వలె ఈఎస్ఐ, పీఎఫ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని టెండర్ల విధానం రద్దు చేసి ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతాడ సత్యనారాయణ, చిర్ర థామస్, చిలకపాటి పౌలు, చానబోయిన కృష్ణారావు, పెనుమత్స వేణుగోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


వెంపలోని సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలి

యలమంచిలి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్ కోరారు. యలమంచిలిలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలసి జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు, మోసపు వాగ్దానాలకు పేటెంట్ హక్కు పొందిన రాజకీయ నాయకుడు చంద్రబాబు అన్నారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్‌లో సగం వాగ్దానాలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఏడాది కాలంలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. చనిపోయిన వారి స్థానంలో కొత్త పింఛన్ మంజూరుచేసే తన ట్రేడ్‌మార్క్ పాలనకు మళ్లీ తెరమీదుకు తెచ్చారని విమర్శించారు. అమ్మకు వందనం పథకానికి అర్హత ఉన్నా కూడా 20 శాతం మందికి తప్పుడు కారణాలతో ఎగ్గొట్టారని స్టాలిన్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వినుకొండ రవి, ఓదూరి భాస్కరరావు, గుర్రాల వెంకట్రావు, గంధం సత్యకీర్తి, గుడాల సురేష్, దొంగ విజయ్‌కుమార్, అడబాల రామ్మోహనరావు, పెచ్చెట్టి రాంబాబు, పాలపర్తి సందీప్, కడిమి బాలరాజు, వీరా ఉమాశంకర్, కుక్కల బాలచంద్రన్, సిర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రీయల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్‌తీగలు మార్పుచేస్తున్నందున ఆ ఏరియాలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు మంగళవారం చెప్పారు. నరసయ్య అగ్రహారం, అల్లూరి సీతారామరాజు విగ్రహం వంటి ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప సబ్ స్టేషన్ పరిధిలో లోసరిలో నూతనంగా నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రమునకు బుధవారం క్రొత్తగా 33 కేవీ లైన్‌లు ఏర్పాటు, వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం గొల్లవానితిప్ప సబ్ స్టేషన్ నుంచి లోసరి వెళ్లే 11 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. తోకతిప్ప, బరువానిపేట, గరవల్లదిబ్బ, లోసరి, దెయ్యాలదిబ్బ, నాగేంద్రపురం, గ్రామాలతో పాటు ఆక్వా చెరువుల లైన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొట్లాట ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

భీమవరం: భీమవరం పట్టణం బ్యాంక్ కాలనీకి చెందిన ఎస్ పాల్‌ను ఇరువురు వ్యక్తులు కొట్టి గాయపర్చారనే ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం చెప్పారు. ఈనెల 15వతేదిన చినపేటలోని సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విందుకు వెళ్లిన పాల్ భోజనం చేస్తున్న తరుణంలో ఎస్ శాస్త్రి, ఎస్ సుధీర్ పాల్‌తో గొడవపడ్డారు. అదేరోజు సాయంత్రం కిరణాషాపు వద్దకు వెళ్లిన పాల్‌ను కొట్టడంతో గాయపడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు చేరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిలకమర్తి ఆశయ సాధనకు కృషి చేయాలి


చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఝాన్సీ లక్ష్మీ బాయి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు తెలిపారు. జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఝాన్సీ లక్ష్మీ బాయి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ మంతెన వెంకట రామరాజు, రచయిత కలిగోట్ల గోపాలశర్మ మాట్లాడుతూ చిలకమర్తి రచన కాలంలో స్వాతంత్రోద్యమంలో ఉద్యమం సాగించిన ఆంధ్రా మిల్టన్, ఆంధ్రాస్కాట్‌గా పేరు ప్రఖ్యాతులు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాతల జేమ్స్, ఎస్ సత్యనారయణ రాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఐజాక్ బాబు, అరవ భాస్కరరావు, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు ఎస్ కే చాన్ భాషా, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు నిషేధం

నరసాపురం రూరల్: విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై నిషేధం ఉందని నరసాపుర ం రూరల్ సీఐ దుర్గా ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని సీతారామపురం గ్రామంలో ఓ విద్యా సంస్థ సమీపంలోని షాపులో విక్రయిస్తున్న సిగరెట్లను సిబ్బందితో కలిసి ఆయన ధ్వంసం చేశారు. ఆయన వెంట మొగల్తూరు ఎస్సై వాసు ఉన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ దందాపై పోరుబాట

నరసాపురం: ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారం అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా స్కూల్స్‌లోనే పుస్తకాలు విక్రయిస్తూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని పట్టణ పౌరుల సంక్షేసంఘం కన్వీనర్ ముచ్చర్ల త్రిమూర్తులు, విద్యార్థులు తల్లితండ్రుల కమిటి కన్వీనర్ సీహెచ్ రాజేష్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల అక్రమ దందాను అరికట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టడానికి ఉద్యమ కార్యాచరణ కోసం బుధవారం మొగల్తూరు రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యార్థుల తల్లితండ్రులు పెద్ద ఎత్తున హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాసవీ శాంతి ధాంలో సామూహిక కుంకుమార్చనలు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో గుంతకల్లు మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగాణంలో గో పూజలు నిర్వహించారు. అనంతరం 102 అడుగుల రుషీ గోత్ర మందిరంలో 92 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహానికి పూజలు నిర్వహించారు.